జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



# పెద్ద కేశుపురం కన్నీటి సంద్రం




* తల్లీ, చెల్లెలకు తలకొరివి పెట్టిన నిఖిత * ఆ కుటుంబానికి వేదనను మిగిల్చిన పిడుగు
* ప్రకృతి ప్రకోపానికి ఓ కుటుంబం బలి * విషాదంలో గ్రామం

**మందస, ఏప్రిల్ 5(వార్త):** విధి వంచించింది.. మనుషుల జీవితాలతో ఆటలాడుకుంది.. కలలో కూడా ఊహించని కష్టం మిగిల్చింది.. వరుస సంఘటనలతో ఆ కుటుంబానికి అన్యాయం చేసింది.. కాయ, కష్టం చేసుకుంటూ బతుకుతున్న ఆ కుటుంబానికి పిడుగు తీరని వేదన మిగిల్చింది. ఆ కుటుంబాన్ని కోలుకోలేని విధంగా విధి దెబ్బతీసింది. మందస మండలంలోని ఉద్దాన ప్రాంతమైన నారాయణపురం పంచాయతీలోని పెద్ద కేశుపురం గ్రామానికి చెందిన మడియా కృష్ణవేణి భర్త మధుసూదనరావు ఇటీవల మరణించారు. ఇద్దరు కుమార్తెలను పెంచి, పోషిస్తూ భారంగా కాలం వెళ్లదీస్తోంది. ఉన్న కొద్దిపాటి పొలంలో గల జీడి, మామిడి పంటలతో పాటు కాయకష్టం చేసుకుంటూ బతుకుతోంది. కృష్ణవేణి ప్రతీ రోజులాగే తోటకు చిన్నకుమార్తె యోగేశ్వరితో తోటకు వెళ్లింది. యోగేశ్వరి ఇటీవలే 10వ తరగతి పరీక్షలు రాసింది. పెద్ద కుమార్తె నిఖిత ఇంటర్మీడియట్ పరీక్షలు రాసి, ఆమె కూడా రిజల్ట్స్ కోసం వేచి చూస్తోంది. తోటకు వెళ్లిన కృష్ణవేణి, యోగేశ్వరి జీడిపిక్కలు ఏరుతున్న సమయంలో మేఘావృతమైంది. మెరుపులు, ఉరుములతో చినుకులు ప్రారంభమయ్యాయి. కొద్దిసేపు చెట్టు కింద ఉండి.. అనంతరం ఇంటికి వెళ్లిపోవాలని తల్లీ, కుమార్తె భావించారు. కానీ, తానొకటి తలిస్తే.. విధి మరొకటి తలచింది. భారీ శబ్ధంతో చెట్టుపై పిడుగు పడింది. చెట్టు కింద ఉన్న తల్లీ, కుమార్తెల ప్రాణాలను అందనిలోకాలకు తీసుకెళ్లింది. అప్పటికే తోటల్లో ఉన్న స్థానికులు, గ్రామస్తులు ఏదో జరుగకూడనిది.. జరిగిందని అనుమానంతో సంఘటనాస్థలానికి చేరుకున్నారు. వారు ఊహించినదే జరిగింది. తల్లీకూతురు విగతజీవులుగా పడివుండడాన్ని గుర్తించారు. దీంతో కన్నీరు, మున్నీరుగా విలపించారు. మందస మండలంలోని హరిపురంలో సామాజిక ఆరోగ్యకేంద్రానికి మృతదేహాలను తరలించారు. సోమవారం పోస్టుమార్టం పూర్తి అయ్యింది. కనీసం మృతదేహాలకు అంత్యక్రియలు నిర్వహించడానికి కుటుంబసభ్యులు ఎవ్వరూ లేకపోవడంతో పెద్ద కుమార్తె నిఖిత తల్లీ, చెల్లెలకు తలకొరివి పెట్టింది. ఈ హృదయవిదారకర సంఘటన చూపరులను కలచివేసింది. ప్రతీ ఒక్కరి కంట కన్నీరు పెట్టించింది. ప్రకృతి ప్రకోపానికి బలైన ఆ కుటుంబం పరిస్థితిపై వారంతా దుఃఖితులయ్యారు. పెద్ద కేశుపురం గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి.

# సమయానికి రారు.. అందుబాటులో ఉండరు!

* ఇది కురిగాం సచివాలయ సిబ్బంది తీరు * సిబ్బంది కోసం గంటల తరబడి ప్రజల పడిగాపులు * కొరవడిన అధికారుల పర్యవేక్షణ




**కొత్తూరు, ఏప్రిల్ 6 (వార్త):** ప్రజలకు వేగవంతమైన, పారదర్శక సేవలు అందిం చాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసిన గ్రామ సచివాలయ వ్యవస్థలో సమయ పాలన ఎంతో కీలకం.



అయితే, కొంతమంది సిబ్బంది నిర్లక్ష్య వైఖరి కారణంగా ప్రజలు సక్రమంగా సేవలు అందడం లేదు. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సచి వాలయ సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళతారో ఆ పెరుమాళ్ళకే ఎరుక. కొత్తూరు మండలం కురిగాం సచివాలయంలో సిబ్బంది సమయానికి హాజరు కాకపోవడం స్థానిక ప్రజలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి పనుల కోసం వచ్చే ప్రజలు గంటల తరబడి కార్యాలయం బయట వేచి ఉండాల్సివస్తోంది. సచివాలయ సిబ్బంది ఎప్పుడు వస్తారో అన్నది సమాచారం ఇచ్చే వారు కరువయ్యారు. ఈ సమస్యపై ఇప్పటికే పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా, పరిస్థితిలో పెద్దగా మార్పు కనిపించక పోవడం గమనార్హం. ఇటీవల ఐ టీడీపీ మండల అధ్యక్షుడు శేపాన విక్రమ్.. కురిగాం సచివాలయాన్ని సందర్శించి హాజరు పట్టికను పరిశీలించారు. మొత్తం 11 మంది సిబ్బందిలో కేవలం నలుగురు మాత్రమే సమయానికి హాజరయ్యారని గమనించారు. మిగిలిన సిబ్బంది ఆలస్యంగా రావడంపై ఆయన స్పందించారు. ప్రభుత్వం నుండి వేతనాలు పొందుతున్న సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వర్తించడం తప్పనిసరి అని అన్నారు. సచివాలయ వ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే సమయపాలనతో పాటు సేవాభావం కూడా అవసరమన్నారు. జిల్లా అధికారులు స్పందించి, బయోమెట్రిక్ హాజరు విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని, విధుల్లో అలసత్వం ప్రదర్శించే సిబ్బందిపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.



# మూలపేట పోర్టు.. ఏపీకి వరం

* కేంద్రం నుంచి 390 ఎకరాలు ఉప్పు భూములు లీజుకు * రాష్ట్ర రహదారులు, భవనాలు, మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి. జనార్ధన్ రెడ్డి * ఈ ఏడాది చివరినాటికి పోర్టు ఆపరేషన్ పనులు * రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు * మూలపేట పోర్టును పరిశీలించిన మంత్రులు

**సంతబొమ్మాళి, ఏప్రిల్6 (వార్త):** మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ ఏపీకి వరమని, ప్రస్తుతానికి ఈ పనులు 70 శాతం పనులు పూర్తయ్యాయని, నవంబర్‌కు శతశాతం పూర్తవుతుందని రాష్ట్ర రహదారులు, భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు శాఖ మంత్రి బి.సి.జనార్ధన్ రెడ్డి స్పష్టం చేశారు. మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టులో జరుగుతున్న అభివృద్ధి పనులను వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడుతో కలిసి పరిశీలించారు. పోర్టు పనుల పురోగతిపై అధికారులతోను, పోర్టు యాజమాన్యంతో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ నిర్మాణంతో శ్రీకాకుళం జిల్లా ప్రజల చిరకాల వాంఛ తీరనుందన్నారు. దాదాపు రూ.4361.91 కోట్లతో చేపట్టిన మూలపేట పోర్టు పనుల్లో.. ఫేజ్ 1లో 1524 ఎకరాల్లో 4 బెర్త్‌ల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. 2025 అక్టోబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నప్పటికీ భూ సేకరణ వంటి అనివార్యకారణాలతో 2026 నవంబర్ నాటికి పోర్టును ప్రారంభించాలన్న దృఢ నిశ్చయంతో పనిచేస్తున్నామన్నారు. మూలపేట పోర్టు ఉత్తరాంధ్రలో వ్యూహాత్మకంగా కీలక స్థానంలో ఉందన్నారు. ఈ పోర్టు ఆంధ్రప్రదేశ్‌తో పాటు తీర ప్రాంతం లేని, సరిహద్దు రాష్ట్రాలైన ఛత్తీస్‌గడ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, దక్షిణ ఒడిస్సా ప్రాంతాలకు అందుబాటులో ఉండే పోర్టు కావడం కలిసొచ్చే అంశమన్నారు. మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టుకు సంబంధించి ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత తమపై ఉందని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు ప్రతి మూడు నెలలకు ఒకసారి పోర్టుల పురోగతిపై సమీక్ష చేస్తున్నట్లు వెల్లడించారు. ఆఫ్‌షోర్ మౌలిక వసతులు గత ప్రభుత్వ హయాంలో ప్రారంభమే కాలేదన్నారు. గత 20 నెలల్లో దాదాపు 13.65 శాతం పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. పోర్టుకు సంబంధించి ఉప్పు భూముల సేకరణ విషయంలో గత ప్రభుత్వం ఎటువంటి ప్రయత్నం చేసిన పాపాన పోలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, 385.24 ఎకరాల భూసేకరణకు అనుమతి పొందడం జరిగిందన్నారు. గత ప్రభుత్వంలో మూలపేట, విష్ణుచక్రం గ్రామాల్లో పునరావాసం కోసం ఎటువంటి చర్యలు చేపట్టలేదని, గత 20 నెలల కూటమి ప్రభుత్వ పాలనలో విష్ణుచక్రం గ్రామంలో పూర్తిగా పునరావాసం కల్పించడం జరిగిందన్నారు. అలాగే మూలపేట గ్రామంలో పునరావాస పనులు ఇప్పటికే పురోగతిలో ఉన్నట్లు వివరించారు. పునరావాసానికి సంబంధించి తాగునీరు కోసం పైప్ లైన్లు, స్వచ్ఛభారత్ కింద టాయిలెట్లు నిర్మాణం, ట్రాన్స్కో, రైల్వే లైన్ వంటి సమస్యలను తమ దృష్టికి తీసుకువచ్చినట్లు చెప్పారు. నౌపడ జంక్షన్లో ఫ్లైఓవర్ ఏర్పాటుకు అధికారులతో చర్చించినట్లు పేర్కొన్నారు. జూలై, ఆగస్టు నెలలో ప్రధాన మంత్రి ఆధ్వర్యంలో భోగాపురం ఎయిర్పోర్ట్ పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామన్నారు.

## పోర్టుతో ఈ ప్రాంతం మరింత అభివృద్ధి

రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్టు పనులు కేవలం 20 శాతం మాత్రమే చేపట్టినట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత 70 శాతం వరకు పనులు పూర్తి చేసినట్లు స్పష్టం చేశారు. పోర్ట్ కు రవాణా సదుపాయం ముఖ్యమని, అందుకు సంబంధించి ఉప్పు భూములు అవసరమని, ఉప్పు భూములు కోసం గత ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి ఒక్క లేఖ పంపలేదన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ ప్రక్రియను వేగవంతం చేసిందన్నారు. పోర్టుకు ఉప్పు భూములు 400 ఎకరాలు అవసరమైతే 399 ఎకరాలు భూములు 99 సంవత్సరాలకు లీజుకు ఇచ్చినట్లు వెల్లడించారు. అక్కడ అటవీ శాఖ భూములు ఉన్నాయని, వాటిని తీసుకొని అటవీ శాఖ కు కాంపన్సేషన్ వేరే ప్రాంతంలో ఇస్తామన్నారు. రోడ్డు, రైల్వే పనులు జరగక పోర్ట్ ప్రారంభం జరగలేదని, ఆ పనులు త్వరితగతిన చేపడుతున్నట్లు చెప్పారు. ట్రయల్ కు మరో షిప్ తీసుకువస్తామన్నారు. ఈ ఏడాదే మూలపేట గ్రీన్ ఫీల్డ్ పోర్ట్ ప్రారంభిస్తామన్నారు. ఆర్ అండ్ ఆర్ కాలనీలో అంగన్వాడీ కేంద్రాలు, తాగునీరు, దేవదాయ, తదితర మౌలిక వసతులు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. మూలపేట పోర్టు నిర్వాసితులకు ఏర్పాటు చేయనున్న ఆర్ అండ్ ఆర్ కాలనీ రాష్ట్రంలో ఆదర్శంగా తీర్చి దిద్దుతామన్నారు. ఈ ప్రాంతానికి పోర్టుతో అనుబంధమయ్యే పరిశ్రమలు రావాలన్నారు. పరిశ్రమలు వస్తే తప్ప ఉపాధి ఉండదన్నారు. పరిశ్రమల ఏర్పాటుకు సానుకూల వాతావరణం ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మారిటైం బోర్డు నుండి సిఈఓ అభిషేక్ కుమార్, చీఫ్ ఇంజనీర్ రాఘవరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునిరెడ్డి, ఆర్డీఓ కృష్ణమూర్తి, టాటా కన్సల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ నుండి ఎ. అనీల్ కుమార్, జి. అనీల్ కుమార్, పి. వివేకనంద, ఎస్బీ కిరణ్ కుమార్, దొరబాబు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జిల్లా జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, మారిటైం బోర్డు నుండి సిఈఓ అభిషేక్ కుమార్, చీఫ్ ఇంజనీర్ రాఘవరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మునిరెడ్డి, ఆర్డీఓ కృష్ణమూర్తి, టాటా కన్సల్టింగ్ ఇంజనీరింగ్ లిమిటెడ్ నుండి ఎ. అనీల్ కుమార్, జి. అనీల్ కుమార్, పి. వివేకనంద, ఎస్బీ కిరణ్ కుమార్, దొరబాబు, పిఎసిఎస్ మాజీ అధ్యక్షులు కింజరాపు హరి వర ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

శ్రీకాకుళం

# భైరగినాయుడుకి కలమట పరామర్శ



కొత్తూరు, ఏప్రిల్ 6 ( వార్త ) : పాతపట్నం నియోజకవర్గంలోని కొత్తూరు మండలం కుంటిభద్ర గ్రామానికి చెందిన సీనియర్ రాజకీయ నాయకుడు ఆగతముడి భైరగినాయుడు అనారోగ్యంతో బాధపడు తున్న నేపథ్యంలో, పాతపట్నం మాజీ శాసనసభ్యుడు కలమట వెంకటరమణ మూర్తి ఆయనను మర్యాద పూర్వకంగా పరామర్శించారు. భైరగినాయుడు నివా సానికి వెళ్లిన కలమట వెంకటరమణ మూర్తి, ఆయన ఆరోగ్య పరిస్థితిపై వివరాలు తెలుసుకుని కుటుంబ సభ్యులతో మాట్లాడారు. భైరగినాయుడు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రాంత అభివృద్ధి కి భైరగినాయుడు చేసిన సేవలు స్మరణీయమని, ఆయన త్వరగా కోలుకుని మళ్లీ ప్రజా సేవలో చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని భైరగినాయుడు ఆరోగ్యం మెరుగుపడాలని ఆకాంక్షించారు.

## రూ.5 లక్షల తో అభివృద్ధి పనులు

ఇచ్ఛాపురం ఏప్రిల్ 6 (వార్త): మండలంలో కొఠారి గ్రామపంచాయతీలో జిల్లా పరిషత్, 15వ ఆర్థిక సంఘం నిధులతో సిసి రోడ్ ,సీసీ కల్వర్టు నిర్మించడం జరుగుతున్నదని మాజీ సర్పంచ్ దుక్క ధనలక్ష్మి అన్నారు. జిల్లా పరిషత్,15వ ఆర్థిక సంఘం నాలుగు లక్షల రూపాయల వ్యయం తో పనులు చురుగ్గా సాగుతున్నట్లు చెప్పారు.

## పలాసలో విద్యుత్ ఘాతంతో యువకుడి తీవ్ర గాయాలు



పలాస, ఏప్రిల్ 6 (వార్త): పలాసలో విద్యుత్ ఘాతంతో యువకుడు తీవ్రగాయపడిన ఘటన కలకలం రేపింది. గాంధీనగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంట్లో విద్యుత్ పనులు చేస్తుండగా సూది కొండకు చెందిన సీతం మురళీ అనే యువకుడు అకస్మాత్తుగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. తీవ్ర గాయాలపాలై ఒక్కసారిగా కుప్పకూలిన యువకుడిని స్థానికులు హుటాహుటిన పలాస ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం అతని పరిస్థితిపై వైద్యులు ప్రత్యేక నిఘా ఉంచి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనతో ప్రాంతంలో తీవ్ర కలకలం నెలకొంది.

## ప్రభుత్వ ధనం దుర్వినియోగం కేసులో నిందితుడికి జైలు శిక్ష విధింపు

పలాస, ఏప్రిల్ 6 (వార్త): పలాస మున్సిపాలిటీ శివాజీ నగర్‌కు చెందిన కళామతల్లి ట్రేడర్స్ యజమాని పాలవలస వైకుంఠరావు ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసి మోసం చేసిన కేసులో పలాస కోర్టు మెజిస్ట్రేట్ యు.మాధురి సోమవారం శిక్ష ఖరారు చేశారు. 2017 సంవత్సరంలో నమోదైన కేసులో విచారణ అనంతరం, పలాస జూనియర్ సివిల్ జడ్జి యు మాధురి సోమవారం తీర్పు వెలువరించారు. ఈ మేరకు నిందితుడికి సెక్షన్ 406 ఐపీసీ కింద మూడు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10,000/- జరిమానా, సెక్షన్ 403 ఐపీసీ కింద రెండు సంవత్సరాల జైలు శిక్షతో పాటు రూ.10,000/- జరిమానా విధిస్తూ, ఈ రెండు శిక్షలను ఏకకాలంలో అనుభవించాలని ఆదేశించారు. ఈ విషయాన్ని కాశీబుగ్గ సీఐ వై. రామకృష్ణ తెలిపారు. వివరాల ప్రకారం, 2017 మే 28న అప్పటి శ్రీకాకుళం జిల్లా సివిల్ సప్లై విభాగం డిస్ట్రిక్ట్ మేనేజర్ ఆర్. వెంకటేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయబడింది. ఫిర్యాదు ప్రకారం, నిందితుడు పాలవలస వైకుంఠరావు, శ్రీకాకుళం సివిల్ సప్లై ఆఫీస్ ద్వారా 1526.400 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని స్వీకరించి, అందుకు బదులుగా 1022.688 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయాల్సి ఉండగా, కేవలం 269.270 మెట్రిక్ టన్నుల బియ్యం మాత్రమే సరఫరా చేసి, మిగిలిన 753.418 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేయకుండా, మొత్తం రూ.3,19,20,550/- విలువైన ప్రభుత్వ ధనాన్ని దుర్వినియోగం చేసి మోసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ ఫిర్యాదు ఆధారంగా అప్పటి ఇన్స్పెక్టర్ కె. అశోక్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా సాక్ష్యాధారాలను సమర్పించగా, ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ పి. రమేష్ వాదనలు వినిపించారు. ఈ కేసులో నేరం రుజువు కావడంతో కోర్టు తుది తీర్పు వెలువరించినట్లు కాశీబుగ్గ ఇన్స్పెక్టర్ రామక్రిష్ణ తెలిపారు.

## పలాసలో కొండ చిలువ హల్ చల్



పలాస, ఏప్రిల్ 6 (వార్త): పలాసలో భారీ కొండచిలువ హల్ చల్ చేసిందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేశారు. గతరాత్రి పురుషోత్తపురం ఎర్ర చెరువు రహదారి వద్ద సుమారు 15 అడుగుల పైథాన్ రోడ్డును దాటుతూ కనిపించడంతో స్థానికులు భయంతో పరుగులు తీశారు. అనంతరం ఆ సర్పం పొదల్లోకి జారుకోవడంతో గ్రామంలో ఉత్కంఠ నెలకొంది. మళ్లీ బయటకు వస్తుందేమోనన్న భయంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు.

## మైనర్ లు వాహనాలు నడిపితే చర్యలు

ఇచ్ఛాపురం ఏప్రిల్ 6 (వార్త):మైనర్ లు వాహనాలు నడిపితే చర్యలు తప్పవని రూరల్ ఎస్ ఐ అర్ .జనార్ధన రావు హెచ్చరించారు. ఎం .తోటూరు జంక్షన్ లో వాహనాలు తనిఖీ నిర్వహించారు. మైనర్ లు వాహనాలు నడిపితే సంబంధిత యజమానులు లేదా తల్లిదండ్రులు పై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నూతన వాహన చట్టం ప్రకారం కఠినంగా శిక్షలు ఉన్నాయని అప్రమత్తంగా ఉండాలని కోరారు. రోడ్డు ప్రమాద నివారణ పై కౌన్సెలింగ్ ఇచ్చారు.



# మోదుగులపుట్టిలో మట్టి మాఫియా దందా

◆రైతుల పేరుతో పెట్రేగిపోతున్నారు ◆వెంచర్లకు వందల ట్రాక్టర్ల మట్టి అమ్మకం ◆అధికారుల కళ్లముందే తతంగం ◆నిబంధనలకు తూట్లు..!



పలాస, ఏప్రిల్ 6 (వార్త): పలాస మండలం మోదుగులపుట్టిలో మట్టి మాఫియా అక్రమాలు బహిరంగంగానే సాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. రైతులు పొలం లోతు చేసుకుంటామని, చెప్పి తహశీల్దార్ కార్యాలయానికి దరఖాస్తులు చేసుకుంటున్నా, వాస్తవానికి వందలాది ట్రాక్టర్లతో మట్టిని వెంచర్లకు, ఇటుక బట్టీలకు తరలిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రెవెన్యూ అధికారులు సరైన పరిశీలన చేయకుండానే ఈ అక్రమాలు కొనసాగుతున్నాయని స్థానికులు మండిపడుతున్నారు. వాల్టా చట్టాన్ని బేఖాతరు చేస్తూ ప్రకృతి సంపదను రియల్ మాఫియా దోచుకుంటోందని తీవ్రంగా ప్రజలు మండిపడుతున్నారు. ఇదిలా ఉంటే, అనుమతులు లేకుండా మట్టిని అమ్ముకోవడం నిబంధనలకు విరుద్ధమని తహశీల్దార్ కళ్యాణ చక్రవర్తి స్పష్టం చేశారు. కేవలం పొలం గట్లపై వేసుకునేందుకు మాత్రమే అనుమతులు ఇస్తామని, అక్రమంగా వెంచర్లకు తరలిస్తే కఠిన చర్యలు తీసుకుని క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## చిన్నారి చికిత్సకు సిక్కోలు ఉద్దానం సేవా సమితి రూ.10వేలు సాయం



మందస, ఏప్రిల్ 6(వార్త): సిక్కోలు ఉద్దానం సేవా సమితి సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. పేదలను ఆదుకోవడం, అన్నదానం, రోగులకు ఆర్థిక సాయమందించడం, కష్టాల్లో ఉన్నవారికి సాయం చేయడం సిక్కోలు ఉద్దానం సేవా సమితి నిరంతరం చేస్తోంది. దీనిలో భాగంగానే సిక్కోలు ఉద్దానం సేవా సమితి ఆధ్వర్యంలో ఓ చిన్నారి చికిత్సకు రూ.10 వేలు ఆర్థిక సహాయం అందించారు. ఇచ్ఛాపురం మండలంలోని లొద్దపుట్టి గ్రామానికి చెందిన ఇసురు దానయ్య పాపకు ఆరోగ్యం బాగులేదని, చాలా సీరియస్ గా ఉందని సిక్కోలు ఉద్దానం సేవా సమితి ప్రతినిధులు తెలుసుకున్నారు. ఆపరేషన్ చేయకపోతే చిన్నారి ప్రాణానికి ప్రమాదం వైద్యులు చెప్పారు. ట్రీట్మెంట్ కోసం ఎక్కువ అమౌంట్ ఖర్చు అవుతుందని అని డాక్టర్స్ చెప్పడంతో పేదరికంతో కూడుకున్న బాధిత కుటుంబానికి తమవంతు సాయంగా 10వేల రూపాయలు అందించారు. కార్యక్రమములో సేవా సమితి సభ్యులు రంజిత్, జగదీష్, జానూ, వరలక్ష్మి గ్రామస్తులు పాల్గొన్నారు.

## రైతు కుటుంబానికి బీమా పరిహారం

కంచిలి,ఏప్రిల్ 6(వార్త ): మండలంలో పెద్ద శ్రీరాంపురం గ్రామం రైతు బెందాలం చిరంజీవి ఇటీవల మృతి చెందారు. మృతుడు విశాఖ డైరీలో సభ్యునిగా ఉన్నందున డైరీ కల్పిస్తున్న భీమా సౌకర్యం ద్వారా అతని కుటుంబానికి 34000 రూపాయలు భీమా పరిహారాన్ని అందజేశారు. సూపర్వైజర్ నాయుడు, మాదిన ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన ఫలితాలు సాధ్యం

### ఉపాధ్యాయుల అవగాహన



సారవకోట, ఏప్రిల్ 6 (వార్త): ప్రభుత్వ పాఠశాలల్లో కూడా విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించవచ్చని సారవకోట జిల్లా పరిషత్ హై స్కూల్ ఉపాధ్యాయులు తెలిపారు. సోమవారం సారవకోట మండల కేంద్రంలో చెరువు వద్ద పనులు చేస్తున్న ఉపాధి హామీ మహిళా వేతనదారులకు ఉపాధ్యాయులు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలల ముసుగులో పడవద్దని, అక్కడ చదివించడం వల్ల కుటుంబాలపై ఆర్థిక భారం పెరుగుతుందని వివరించారు. ప్రభుత్వ పాఠశాలల్లోనూ నాణ్యమైన విద్య, మెరుగైన ఫలితాలు సాధ్యమేనని తెలిపారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై విశ్వాసం పెంచుకుని తమ పిల్లలను అక్కడే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మహిళా కార్మికులు పాల్గొన్నారు.

## 8న విద్యుత్ సరఫరాలో అంతరాయం

మందస, ఏప్రిల్ 6(వార్త): మందస మండలంలోని హరిపురం, ఉద్దానం ప్రాంతంలో ఈనెల 8న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.యజ్ఞేశ్వరరావు చెప్పారు. 33/11 హరిపురం సబ్ స్టేషన్ లో ఆర్డీఎస్ఎస్ విభాగంలో ఉద్దానం ఫీడర్ బైఫ్రికేషన్ పనులలో భాగంగా ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు హరిపురంటౌన్ లోని పెద్దవీధి, కాపు వీధి, హెచ్ బీ కాలనీ, బీఎంపురం, రట్టి, బేతాళపురం, బహడపల్లి, నారాయణపురం, సువర్ణపురం, మర్రిపాడు, అంబుగాం, పిడిమందస, కుంటికోట, వీరగున్నమ్మపురం పరిసరి ప్రాంతాలకు విద్యుత్ నిలిపివేయబడుతుందన్నారు. విద్యుత్ శాఖ సిబ్బందికి వినియోగదారులు సహకరించాలని వారు కోరారు.

## పదో తరగతి బ్రిడ్జ్ క్లాసుల పరిశీలన..

### ఎంఈఓ సూచనలు



సారవకోట, ఏప్రిల్ 6 (వార్త): సారవకోట మండలం చిన్న కిట్టాలపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదో తరగతి బ్రిడ్జ్ క్లాసులను ఎంఈఓ మద్దు వెంకటరమణ సోమవారం పరిశీలించారు. పాఠశాలకు చేరుకున్న ఆయన 9వ తరగతి నుంచి పదో తరగతికి వెళుతున్న విద్యార్థులకు ప్రత్యేకంగా అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు సన్నద్ధం కావడంలో ఈ బ్రిడ్జ్ క్లాసులు ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పరీక్షల్లో ఎలా ముందుకు సాగాలి, ఎలాంటి లక్ష్యాలు పెట్టుకోవాలి, మంచి ఫలితాలు సాధించేందుకు ఏ విధంగా ప్రణాళికతో చదవాలి వంటి అంశాలపై విద్యార్థులకు వివరంగా మార్గదర్శనం చేశారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

# ప్రజా సమస్యలపై సామాజికవేత్త భామిడి రాజు పోరు

### పీయూసీ చైర్మన్ కూన రవికుమార్‌తో భేటి





కొత్తూరు, ఏప్రిల్ 6 ( వార్త ) : శ్రీకాకుళం జిల్లా పరిషత్‌లో ఈరోజు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో ప్రముఖ సామాజిక వేత్త, ఎంపీహెచ్ డెవలపర్స్ అధినేత, టీడీపీ యువ నాయకులు భామిడి రాజు చురుగ్గా పాల్గొన్నారు. ఓంద్రుజోల గ్రామ యువకులతో కలిసి స్వయంగా జిల్లా పరిషత్‌కు వెళ్లిన ఆయన, ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం మండల రెవెన్యూ అధికారిని కలిసి స్థానిక సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని కోరుతూ వినతి పత్రాన్ని అందజేశారు. సామాన్యుల సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలో కృషి చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వరంగ సంస్థల కమిటీ (గ్రాఖజ) చైర్మన్, ఆముదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ ని ఆయన నివాసం వద్ద భామిడి రాజు తన బృందంతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీలో పలు సామాజిక అంశాలపై చర్చించారు. భామిడి రాజు వెంట ఓంద్రుజోల యువకులు మరియు ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

# భూగర్భ జల వనరులను కాపాడుకోవాలి

◆ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి ◆"నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమానికి శ్రీకారం



పోలాకి, ఏప్రిల్ 6 (వార్త): భూగర్భ జల వనరులను కాపాడుకోవడం నేటి అత్యవసర అవసరమని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి అన్నారు. పోలాకి మండలం పిరువాడ పంచాయతీ ఓదిపాడు గ్రామంలో "నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత" కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం జలయజ్ఞం భాగంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. ఈ నెల 6వ తేదీ నుంచి వంద రోజుల పాటు కొనసాగించేలా ప్రత్యేక యాక్షన్ ప్లాన్ రూపొందించామని పేర్కొన్నారు. గ్రామాల అభివృద్ధి కోసం చెరువులను పునరుద్ధరించడం, ప్రతి బొట్టు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంపొందించడం అత్యంత అవసరమని అన్నారు. ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాకుండా భవిష్యత్తు తరాల కోసం చేయాల్సిన బాధ్యతగా ప్రతి ఒక్కరూ భావించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమం సందర్భంగా రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కళింగ కార్పొరేషన్ ఛైర్మన్ రోణంకి కృష్ణన్నాయుడు, వంశధార డిస్ట్రిబ్యూటరి కమిటీ ఛైర్మన్లు, పోలాకి పిఏసిఎస్ ఛైర్మన్ భైరి భాస్కరరావు, మార్కెట్ కమిటీ వైస్ ఛైర్మన్ గొర్లె యర్రయ్య, నీటి సంఘాల ప్రతినిధులు, మాజీ సర్పంచ్లు, వివిధ శాఖల అధికారులు, ఎంపీడీవో, ఏపిడీ కె. లోకేశ్వరరావు, వంశధార, ఉద్యానవన, అటవీ శాఖల అధికారులు, రైతులు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మిస్తాం

ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి

సారవకోటలో తహశీల్దార్ కార్యాలయానికి శంకుస్థాపన



సారవకోట, ఏప్రిల్ 6 (వార్త): కూటమి ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించేందుకు కృషి చేస్తున్నామని నరసన్నపేట శాసనసభ్యులు బగ్గు రమణమూర్తి తెలిపారు. సారవకోట మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయ నిర్మాణానికి సోమవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రోడ్లు, భవనాల శాఖ ఆధ్వర్యంలో రూ.1.75 కోట్లు నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. ఈ భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ కార్యాలయాలకు సౌకర్యవంతమైన భవనాలు అవసరమని, ప్రజలకు సేవలు సులభంగా అందేలా మౌలిక వసతులు మెరుగుపరచడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల ప్రజాపరిషత్ అధ్యక్షులు చిన్నాల కూర్మినాయుడు, సారవకోట పిఎసిఎస్ ఛైర్మన్ సురవరపు తిరుపతిరావు, మండల పార్టీ అధ్యక్షులు కత్తిరి వెంకటరమణ, జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు పొద్దిన రత్నాలునాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జ్ పట్ట ఉమామహేశ్వరరావు, వైస్ ఎంపీపీ ప్రతినిధి శోభనపురం మురళీధర్, ఎంపిటిసి సభ్యులు దాము ఆదినారాయణ, మాజీ సర్పంచ్ పోలాకి చిన్నబాబు, పిఎసిఎస్ డైరెక్టర్ శిమ్మ రామకృష్ణ, తెలుగు యువత అధ్యక్షులు పిల్లా నందకిషోర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే టెక్కలి ఆర్డిఓ, జిల్లా రోడ్లు , భవనాల శాఖ అధికారులు , తహశీల్దార్, ఎంపీడీవో తదితరులు హాజరయ్యారు.

## సమ్మేటివ్ అసెస్మెంట్ పరీక్షల ఆకస్మిక పరిశీలన

జలుమూరు, ఏప్రిల్ 6 (వార్త): విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మేటివ్ అసెస్మెంట్ - 2 పరీక్షలను ఎంఈఓ బమ్మిడి మాధవరావు ఆకస్మికంగా పరిశీలించారు. సోమవారం లింగాలవలస జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించిన ఆయన, పరీక్షలు సక్రమంగా జరుగుతున్నాయా అని పరిశీలించి ఉపాధ్యాయులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. అదేవిధంగా పాఠశాలలో 9వ తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న బ్రిడ్జ్ కోర్సుపై కూడా విద్యార్థులతో మాట్లాడి సమాచారం సేకరించారు. పదో తరగతి పరీక్షలకు సిద్ధం కావడంలో ఈ బ్రిడ్జ్ కోర్సు ఎంతో ఉపయోగకరమని ఆయన పేర్కొన్నారు. పరీక్షలను నిబంధనల ప్రకారం నిర్వహించాలని, విద్యార్థులకు మెరుగైన మార్గదర్శనం అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు.





## తాగునీటి సమస్య పరిష్కరించాలి

గ్రామస్తుల ఫిర్యాదు

సారవకోట, ఏప్రిల్ 6 (వార్త): సారవకోట మండలం అలుదు గ్రామంలోని రెల్లి వీధి ప్రజలు తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన సారవకోట గ్రీవెన్స్ కార్యక్రమంలో గ్రామస్తులు ఫిర్యాదు చేస్తూ, తమ ప్రాంతంలో తాగునీటి సరఫరా సక్రమంగా జరగడం లేదని ఆరోపించారు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకుని వినియోగించాల్సి వస్తోందని, ఆ నీటి వల్ల ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తాగునీటి సరఫరాను మెరుగుపరచాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# ఇండెన్ గ్యాస్ అక్రమాలు పై దర్యాప్తు చేయండి



ఇచ్ఛాపురం ఏప్రిల్ 6 (వార్త): ఇండెన్ గ్యాస్ పంపిణి అవకతవకలపై జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ డాక్టర్ సీపాన గుణవతి సూచన మేరకు సంఘం ప్రతినిధులు జిల్లా అడ్వైసర్ ఎల్. గోవిందరాజులు, మండల కన్వీనర్ ఎస్. ఢిల్లీ రావు, మహిళా కన్వీనర్ సాలిన పద్మ ఇచ్ఛాపురం ప్రాంతంలో జరుగుతున్న ఎల్ పి జీ అక్రమాలు, బ్లాక్ మార్కెట్ విక్రయాలు, వినియోగదారుల దోపిడీ, చిన్న వ్యాపారుల ఉపాధి నాశనం వంటి సమస్యలపై రెవెన్యూ శాఖకు ఫిర్యాదు చేశారు. సోమవారం డిప్యూటీ తహసీల్దార్ శ్రీహరి కి వినతిపత్రం అందజేశారు. ఇండెన్ గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌కు సంబంధం లేని ఒక వ్యక్తి అధికారిక అనుమతి లేకుండా, లైసెన్స్ లేకుండా, నిబంధనలను బహిరంగంగా ఉల్లంఘిస్తూ ప్రజలకు సిలిండర్లను అక్రమంగా సరఫరా చేస్తున్నాడని. అదేవిధంగా గృహ , కమర్షియల్ ఎల్ పి జీ సిలిండర్లను గోదాముల్లో దాచిపెట్టి హోటల్స్, టీ స్టాళ్లు, చిన్న వ్యాపారులకు అధిక ధరలకు బ్లాక్ మార్కెట్లో అమ్మడం వల్ల సరఫరాలో కృత్రిమ కొరత ఏర్పడుతుందని.దీనివల్ల చిన్న వ్యాపారులు తీవ్రంగా నష్టపడి ఉపాధి కోల్పోవటం పట్ల సంఘం సభ్యులు తోవ్ర ఆందోళన వ్యక్తం చేశారు.ప్రతి సిలిండర్‌పై ప్రభుత్వ ధర కు విరుద్ధంగా అదనంగా వసూలుచేయడంవినియోగదారులపై స్పష్టమైన దోపిడీ అని, ఇది ఏనిషియల్ కామడిటీస్ యాక్ట్ ఉల్లంఘన అయినప్పటికీ అక్రమ వసూళ్లు కొనసాగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఇచ్ఛాపురం--ఒడిశా సరిహద్దు ప్రాంతాన్ని ఉపయోగించి ఇక్కడి సిలిండర్లను బల్క్‌గా ఒడిశాకు తరలించి అక్కడ అధిక ధరలకు విక్రయించడం వల్ల స్థానిక ప్రజలకు తీవ్రమైన కొరత ఏర్పడుతోందని పేర్కొన్నారు. ప్రజలు అనేకసార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ స్థానిక రెవెన్యూ అధికారుల నుండి ఎటువంటి పర్యవేక్షణ, తనిఖీలు జరగకపోవడం వల్ల అక్రమాలకు అప్రత్యక్ష ప్రోత్సాహం లభిస్తున్న భావన ఏర్పడిందని, దీనితో ప్రజల్లో తీవ్ర అసంతృప్తి నెలకొన్నట్లు వారు పిటిషన్‌లో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో సంఘం ప్రతినిధులు అక్రమ గ్యాస్ పంపిణీ బ్లాక్ మార్కెట్ కార్యకలాపాలపై ప్రత్యేక దర్యాప్తు చేయించి కఠిన చర్యలు తీసుకోవాలని, చిన్న వ్యాపారులకు కమర్షియల్ సిలిండర్లను సకాలంలో అందించేందుకు ప్రత్యేక పర్యవేక్షణ ఏర్పాటు చేయాలని, ప్రతి సిలిండర్‌పై జరుగుతున్న అక్రమ వసూళ్లను తక్షణమే నిలిపివేసి బాధ్యులపై కేసులు నమోదు చేయాలని, ఒడిశా సరిహద్దు వద్ద ప్రత్యేక విజిలెన్స్ చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి అక్రమ రవాణాను అరికట్టాలని, ప్రస్తుత పంపిణీ వ్యవస్థ పూర్తిగా విఫలమైనందున ఇచ్ఛాపురం ప్రాంతానికి కొత్త అర్హత కలిగిన గ్యాస్ డిస్ట్రిబ్యూటర్‌ను నియమించాలని డిమాండ్ చేశారు. అలాగే రెవెన్యూ శాఖ నిర్లక్ష్యంపై విచారణ జరిపి తగిన క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్ కీ ఇచ్చిన రిజిస్టర్ పోస్టు పిటిషన్ ద్వారా కోరారు.ఇచ్ఛాపురం పట్టణంలో జరుగుతున్న ఈ ఎల్ పి జీ అక్రమాలు వినియోగదారుల హక్కులకు, చిన్న వ్యాపారుల జీవనోపాధికి తీవ్రమైన ముప్పుగా ఉన్నాయని సంఘం పేర్కొంది. జిల్లాశాఖ అధికారులు తక్షణమే స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు.

## శ్రీకాకుళం

### 9వ తేదీ జరిగే జాతీయ లోక్ అదాలత్

## సద్వినియోగం చేసుకోవాలి

సివిల్ జడ్జి యు.మాధురి



పలాస, ఏప్రిల్ 6 (వార్త): ఈనెల 9వ తేదీ జరిగే జాతీయ లోక్ అదాలత్ సద్వినియోగం చేసుకోవాలని పలాస జూనియర్ సివిల్ జడ్జి యు మాధురి కోరారు. సోమవారం పలాస కోర్టు ఆవరణలో పలాస మండల న్యాయ సేవా సంఘం, జూనియర్ సివిల్ జడ్జ్ యు. మాధురి ఆధ్వర్యంలో పలాస బార్ అసోసియేషన్ న్యాయవాదులతో చిట్ఫండ్ కంపెనీల న్యాయవాదులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. మే 9 వ తారీఖున ఈ సంవత్సరములో రెండవ జాతీయ లోక్దాలతో నిర్వహించాలని రాష్ట్ర జిల్లా న్యాయ సేవ అధికార సంస్థల నుండి వచ్చిన ఆదేశాలపై మే 9 వ తారీఖున జాతీయ లోక్దాలత నిర్వహిస్తామని తెలియజేస్తూ న్యాయవాదులందరూ, అదేవిధంగా చిట్ఫండ్ కంపెనీల వారందరూ ఈ అవకాశమును సద్వినియోగం చేసుకుని ఎక్కువ సంఖ్యలో పెండింగ్లో గల సివిల్ క్రిమినల్, మనోవర్తి గృహహింస తదితర కేసులను రాజీ చేసుకోవాలని న్యాయమూర్తి విజ్ఞప్తి చేశారు. కక్షిదారులు అందరూ కూడా ఈ జాతీయలో ఒకదానత్తును సద్వినియోగం చేసుకుని వారికి గల పెండింగ్ మరియు ప్రీ లిటిగేషన్ కేసులను రాజీ చేసుకోవాలని న్యాయమూర్తి తెలియజేశారు. ఈ సమావేశంలో న్యాయవాదుల సంఘం అధ్యక్షులు మహమ్మద్ ఫయాజ్ అహ్మద్, సీనియర్ న్యాయవాదులు బి కామేశ్వరరావు పట్నాయక్, వైస్ ప్రెసిడెంట్, పి.లక్ష్మీనారాయణ, జి. ప్రభాకర్ రావు, టి. మురళీమోహన్ రావు, వై. హేమ కుమార్, టి. శ్యాంసుందర్రావు, కె. రజిని కుమార్, ఎస్ వెంకట రావు, హెచ్ సుధా రాణి, కె. దేవరాజు, పి. చిట్టిబాబు, కె. శ్రీనివాస్, సిహెచ్. దివ్యశ్రీ, న్యాయవాద గుమస్తాలు నారాయణరావు, లక్ష్మణరావు, ప్యారా లీగల్ వాలంటీర్ శ్రీ సునీల్ తదితరులు పాల్గొన్నారు.

## పేకాట శిబిరంపై పోలీసుల దాడి.. ముగ్గురు అరెస్ట్



పోలాకి, ఏప్రిల్ 6 (వార్త): పోలాకిలోని రేవు అంపలాం వద్ద నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు దాడి చేసి ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ విషయాన్ని ఎస్సై జి. రంజిత్ తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు ఆదివారం సాయంత్రం పోలీసు సిబ్బందితో కలిసి దాడి నిర్వహించామని ఆయన చెప్పారు. ఈ దాడిలో ముగ్గురిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు వివరించారు. అరెస్టు చేసిన వారి వద్ద నుంచి రూ.1,200 నగదును స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నట్లు పోలీసులు వెల్లడించారు.

## మద్యం సేవించి వాహనాలు నడపొద్దు

ఏఎస్ఐ కృష్ణారావు హెచ్చరిక

సారవకోట, ఏప్రిల్ 6 (వార్త): మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఏఎస్ఐ కృష్ణారావు వాహనదారులకు సూచించారు. సోమవారం సారవకోటలో జాతీయ రహదారి 326ఏపై పోలీసులు ప్రత్యేక వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సరైన రికార్డులు లేకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం వంటి నిబంధనలు ఉల్లంఘించిన 10 మంది వాహనదారుల వద్ద నుంచి రూ.1,200 జరిమానా వసూలు చేశారు. అలాగే పెండింగ్‌లో ఉన్న పాత బకాయిలను కూడా వాహనదారుల నుంచి ఛలానా రూపంలో వసూలు చేసినట్లు తెలిపారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, మద్యం సేవించి వాహనాలు నడపడం, అతివేగంగా ప్రయాణించడం ప్రమాదకరమని హెచ్చరించారు.



# మబగం అభివృద్ధికి పాలకవర్గం కృషి అభినందనీయం

◆ సర్పంచ్, వార్డు సభ్యుల ఘన సన్మానం

◆ మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ ప్రశంసలు



పోలాకి, ఏప్రిల్ 6 (వార్త): గడిచిన ఐదేళ్లలో మబగం పంచాయతీ అభివృద్ధికి సర్పంచ్, వార్డు సభ్యులు అంకితభావంతో కృషి చేశారని మాజీ ఉపముఖ్యమంత్రి ధర్మాన కృష్ణదాస్ కొనియాడారు. మబగం పంచాయతీ పాలకవర్గం పదవీకాలం పూర్తయిన సందర్భంగా గ్రామంలోని నివాసంలో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ధర్మాన కృష్ణదాస్ మాట్లాడుతూ ప్రజలు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని గ్రామాన్ని అభివృద్ధి దిశగా నడిపించిన ప్రజాప్రతినిధులను అభినందించడం సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. అనంతరం యువ నాయకుడు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య మాట్లాడుతూ, పదవిలో ఉన్నా లేకపోయినా ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం నిజమైన నాయకత్వ లక్షణమని, మబగం ప్రతినిధులు ఆ దిశగా ఆదర్శంగా నిలిచారని అన్నారు. గ్రామాభివృద్ధిలో యువత మరింత చురుకుగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, వార్డు సభ్యులను శాలువాలతో కప్పి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. స్థానిక నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో మబగంలో పండుగ వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, పార్టీ అనుచరులు పాల్గొన్నారు.

జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## 12న మందసలో నాసా స్కాలర్ షిప్-2026 ప్రతిభా పరీక్ష

**మందస, ఏప్రిల్ 6(వార్త):** మందస పట్టణంలోని వివేకానంద విద్యానికేతన్ స్కూల్‌లో ఈ నెల 12న నాసా స్కాలర్ షిప్-2026 ప్రతిభా అన్వేషన పరీక్ష నిర్వహించనున్నట్టు వ్యవస్థాపకుడు గోరు బాబురావు, కార్యనిర్వాహక సభ్యులు వడ్డి శివ, సల్ల ప్రసాద్, వివేకానంద విద్యానికేతన్ ప్రిన్సిపల్ బోర ఉమాపతి, నెయ్యిల నరసింహారావు, శ్యామ్, అప్పన్న తెలిపారు. అంపోలు నాగరాజు, వడ్డి సంతోష్‌ల జ్ఞాపకార్థం ఈ ప్రతిభా పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రథమ బహుమతి రూ.14వేలు, ద్వితీయ బహుమతి రూ.12వేలు, తృతీయ బహుమతి రూ.10వేలు అందజేస్తామన్నారు. పరీక్షా విధానం ఆబ్జెక్టివ్ టైప్‌లో ఉంటుందన్నారు. గణితం 20మార్కులు, భౌతిక శాస్త్రం 10మార్కులు, రసాయన శాస్త్రం 10మార్కులు, జీవశాస్త్రం 10మార్కులు, సాంఘిక శాస్త్రం 10మార్కులు, ఇంగ్లీష్ 10మార్కులు. జీకే, కరెంట్ అఫైర్స్ 10మార్కులుంటాయన్నారు. మందసలోని వివేకానంద స్కూల్ పరీక్షా కేంద్రంగా ఈ నెల 12న ఉదయం 10గంటలకు పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. రిజిస్ట్రేషన్, ఇతర వివరాలకు వడ్డి శివ 8608302367, ప్రసాద్ 9030465373, బోర ఉమాపతి 8341008945 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని వారు కోరారు.




## నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత

**మందస, ఏప్రిల్ 6(వార్త):** నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత అని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన, మందస ఎంపీడీఓ వై.వెంకటరమణ, జలవనరులశాఖ ఏఈ ఎస్.వి.శ్రీనివాసరావు అన్నారు. మందస పట్టణంలో తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు బావన దుర్యోధన అధ్యక్షతన నీటి భద్రత సాగునీటి సంఘాల బాధ్యత 100 రోజులు కార్యక్రమం జరిగింది. ఈ సందర్బంగా వక్తలు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు పలాస శాసనసభ్యురాలు గౌతు శిరీష ఆదేశాల మేరకు మందస పట్టణంలోని జెన్నాచెరువు దగ్గర ఈ కార్యక్రమం చేపట్టడం జరిగిందన్నారు. సాగునీటి సంఘాల అధ్యక్షులు ప్రత్యేకంగా దృష్టి సారించి, వారి పరిధిలో ఉన్న చెరువులు, సాగునీటి కాలువలు, ఫీడర్ ఛానల్ ను, స్లూయిస్‌ను సర్ప్లస్ వేర్ ను, పాడైన వాటిని గుర్తించాలన్నారు. వాటిని అధికారుల దృష్టికి తీసుకుని వెళ్లి, ఆ పనులన్నిటికీ ఎస్టిమేషన్లు వేస్తే.. ప్రభుత్వం ఆ పనులన్నిటికీ నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. మంజూరైన పనులన్నింటినీ ఏప్రిల్ 21నుండి జూలై 14వ తేదీ లోపల పూర్తి చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి తాతారావు, కార్యదర్శి సాలిన మాధవరావు, సునాముది సిస్టం అధ్యక్షుడు రట్టి లింగరాజు, దుంకురు తిరుపతి, రాజాన మహేష్, దేబాసిస్ పండా, మెట్ట మహేష్, సంతోష్ కుమార్ పండా, గార కృష్ణారావు, గేదెల దుర్యోధన, గుంట నారాయణ, మార్పు మాధవరావు, దేవరశెట్టి మార్కండేయులు, సీర ఈశ్వరరావు, సింగపురం పాపారావు, కొర్రాయి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా బిజెపి వ్యవస్థాపక దినోత్సవం



**మెళియాపుట్టి ఏప్రిల్6 (వార్త):** బిజెపి వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమాన్ని మెళియాపుట్టి మండలంలో గల జాడుపల్లి గ్రామంలో ఆ పార్టీ మండల ఉపాధ్యక్షులు వైశ్యరాజు శ్రీనివాస్ రాజు నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన బీజేపీ సీనియర్ నాయకులు డాక్టర్ సలాన శరత్ కుమార్ మాట్లాడుతూ దేశమే ముందు, తదుపరి పార్టీ, చివరన వ్యక్తి అనే నినాదంతో లక్ష్యాలతో పనిచేసే ఏకైక పార్టీ భారతీయ జనతా పార్టీయేనన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో దేశంలో సుస్థిరమైన పరిపాలన జరుగుతుందన్నారు. అదేవిధంగా బిజెపి పార్టీ రాష్ట్ర అధ్యక్షులు పివిఎన్ మాధవ్ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో కూడా మన ఊరు మన జెండా కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తెలియజేస్తూనే పార్టీని బూత్ స్థాయి నుంచి బలోపేతానికి ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు సలాన రాఘవరావు, వనజంగి రమేష్, నక్క వెంకట్రావు, తాడేల భూపతి, పోలాకి మురళి, భోగేశ్వరరావు, శశి, లోడగల శ్రీను, బొచ్చు పాపారావు, కార్యకర్తలు గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఘనంగా అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవం



**సోంపేట ఏప్రిల్6 (వార్త):** మామిడిపల్లి పంచాయతీ చిన్న మామిడిపల్లి గ్రామంలో సోమవారం అభయాంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవాన్ని గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేక కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అనంతరం గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులకు అన్న సమారాధన చేశారు.

## నీటి భద్రత లక్ష్యం కావాలి




**పలాస, ఏప్రిల్ 6 (వార్త):** నీటి భద్రత నీటి సంఘాల బాధ్యతని జిల్లా గ్రంథాలయ చైర్మన్ పీరుకట్ల విఠల్ అన్నారు. పలాస మండలం సున్నాడ గ్రామంలో పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష ఆదేశాలు మేరకు జగన్నాథ సాగరం చెరువు వద్ద ఏర్పాటు చేసిన నీటి భద్రత - నీటి సంఘాల బాధ్యత కార్యక్రమంలో గ్రంథాలయ చైర్మన్ పీరికట్ల విఠల్ రైతులకు ఉపాధి కూలీలకు స్థానిక ప్రజలకు ఈ కార్యక్రమము యొక్క ప్రాధాన్యతను వివరించి పనులు గుర్తించామని, వాటిలో మీ అందరూ భాగస్వాములు కావాలని భావితరాల కోసం భూగర్భ జలాలను పెంచడం కోసం ఈ కార్యక్రమం పెద్ద ఎత్తున రాష్ట్ర వ్యాప్తంగా ఒక నిర్దిష్ట కాలపరిమితిలో చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంకల్పానికి మనందరం సహకరించాలని కోరడం జరిగింది. కార్యక్రమంలో నియోజకవర్గ ప్రత్యేక అధికారి వినాయకమ, ఎంపీడీవో వసంత్ కుమార్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాసరావు, పిఎసిఎస్ అధ్యక్షులు వంకల కూర్మారావు, కుత్తమ లక్ష్మణ్ కుమార్, దువ్వాడ సంతోష్ కుమార్, దల్లి ప్రసాదరావు, ఇరిగేషన్ అధికారులు ఉపాధి హామీ అధికారులు ఏవో, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెల్లువెత్తిన వినతులు





**శ్రీకాకుళం, ఏప్రిల్ 6 (వార్త):** అర్జీలు సత్వరమే పరిష్కరించాలని డిప్యూటీ కలెక్టర్ జయదేవి అధికారులను ఆదేశించారు. జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు, పరిష్కార వేదికలో డిప్యూటీ కలెక్టర్లు జయదేవి, డిప్యూటీ కలెక్టర్ పద్మావతిలు 123 అర్జీలు స్వీకరించారు. ప్రధానంగా సొసైటీ ఫర్ ఎలిమినేషన్ ఆఫ్ రూరల్ పవారిటీ 31, రెవెన్యూ శాఖ 18, పంచాయతీ రాజ్ 16, రూరల్ వాటర్ సప్లై ఇంజనీరింగ్ 7, ఏపీ స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ 6, మునిసిపల్ శాఖ 6, విద్యుత్ శాఖ 4, సర్వే మరియు ల్యాండ్ రికార్డ్స్ 4, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ 4, రోడ్లు మరియు భవనాల శాఖ 4, రూరల్ డెవలప్మెంట్ 4, వాటర్ రిసోర్స్ 4,వ్యవసాయ శాఖ 2, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ 2, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ 2 , మార్కెటింగ్ , డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, కోపరేటివ్ సొసైటీ, సైనిక్ వెల్ఫేర్, సివిల్ సప్లై, ఫైనాన్స్ , రోడ్డు రవాణా, ఫారెస్ట్ మరియు ఏపీ పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ కు ఒక్కొక్క దరఖాస్తు చొప్పున స్వీకరించారు. ఆయా శాఖలకు సంబంధించి 123 అర్జీలు స్వీకరించారు. అర్జీలు స్వీకరించిన వారిలో జిల్లా రెవెన్యూ అధికారి వి.విశ్వేశ్వరావు, డిప్యూటీ కలెక్టర్ లక్ష్మణమూర్తి, కలెక్టరేట్ పరిపాలనాధికారి జి.ఎ.సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

### రబీకి నీరు విడుదల చేయండి

రబీ వరి పంటకు సాగునీరు అందక ఎండిపోతున్న పొలాలను తక్షణమే పరిశీలించి, సాగునీరు విడుదల చేయాలని యువ నాయకులు డాక్టర్ ధర్మాన కృష్ణ చైతన్య కోరారు. సోమవారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన గ్రీవెన్స్ డే సందర్భంగా ఆయన డిప్యూటీ కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల పరిధిలోని భగీరథపురం, దోమలపల్లి, అక్కరపల్లి, పింద్రువాడ, కరకవలస, ముఖలింగం, నగిరి కటకం, మర్రివలస తదితర గ్రామాల్లో సాగునీటి ఎద్దడి తీవ్రంగా ఉందని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సుమారు 300 ఎకరాల్లో వరి పంట ప్రస్తుతం పొట్ట దశలో ఉందని, ఈ కీలక సమయంలో నీరు అందకపోవడం వల్ల పంటలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడులు పెట్టి చేతికొచ్చే దశలో పంట ఎండిపోతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడి యుద్ధ ప్రాతిపదికన ఈ గ్రామాలకు సాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డిప్యూటీ కలెక్టర్, సమస్య పరిష్కారానికి తక్షణమే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఎంపీపీ వాన గోపి, రాష్ట్ర రైతు కార్యదర్శి కనపల శేఖర్ రావు, జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు రౌతు శంకరరావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు గురుగుబెల్లి వెంకట రమణి,నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షులు ధర్మాన జగన్ మోహన్, మండల అధ్యక్షులు కనుసు సీతారాం, మండల బూత్ కమిటీ అధ్యక్షులు బబ్బోది ఈశ్వరరావు, మండల ఉప అధ్యక్షులు బసవ రమణమూర్తి, సీపాన మోహన్,తోట భార్గవ్, కనపల అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులు చట్ట పరిధిలో పరిష్కరించాలి

* జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి
* 61 వినతుల స్వీకరణ

**శ్రీకాకుళం క్రైం, ఏప్రిల్ 6 (వార్త):** ప్రజా ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమంలో చట్ట పరిధిలో పరిష్కరించాలని, అర్జీదారులు సంతృప్తి పొందేలా పూర్తి స్థాయిలో విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి జిల్లా పోలీసు అధికారులకు ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల నమోదు మరియు పరిష్కార వేదిక కార్యక్రమంలో ఎస్పీ మొత్తం 61 మంది ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం ఫిర్యాదు దారులతో ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని, వాటిని సమగ్రంగా పరిష్కరిస్తామని భరోసా కల్పించారు.స్వీకరించిన అర్జీలు మరియు వివరాలను జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా తక్షణమే సంబంధిత పోలీసు అధికారులకు తెలియజేసి,చట్ట ప్రకారం చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు.ప్రజా ఫిర్యాదులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, ఎటువంటి నిర్లక్ష్యం లేకుండా వేగవంతంగా పరిష్కారం చూపాలని ఎస్పీ సూచించారు. ఈ క్రమంలో ఎస్పీ స్వయంగా అర్జీదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.ఆయా ఫిర్యాదులపై తీసుకున్న చర్యలను నిర్ణీత కాలంలో జిల్లా పోలీసు కార్యాలయానికి నివేదిక రూపంలో పంపించాలని అధికారులను ఆదేశించారు.మొత్తం స్వీకరించిన ఫిర్యాదులు 61 కాగా, వాటిలో కుటుంబ సమస్యలు, మోసపూరిత కేసులు, ఆస్తి వివాదాలు, సివిల్ , సైబర్ , ఇతర అంశాలకు సంబంధించినవి ఉన్నాయి.




# ప్రతి నీటి చుక్కనూ ఒడిసి పడదాం

* ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్

**బూర్జ, ఏప్రిల్ 6(వార్త):** ప్రతి నీటి చుక్కను ఒడిసిపట్టి రైతన్నలకు మేలు చేకూరేలా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని, సాగు, మంచినీటి అవసరాలను తీర్చి, నీటి భద్రత కల్పించ డమే మన లక్ష్యం కావాలని ఆముదాలవలస ఎమ్మెల్యే, రాష్ట్ర పీయూసీ చైర్మన్ కూన రవికుమార్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జల వనరుల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన 'నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత' 100 రోజుల ప్రత్యేక కార్యక్రమాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. బూర్జ మండలం కాలపర్తి పంచాయతీ వేదికగా ప్రారంభమైన ఈ బృహత్తర కార్యక్రమం జూలై 25వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగనుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో వేధిస్తున్న నీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకే ప్రభుత్వం ఈ 100 రోజుల ప్రణాళికను రూపొందించిందని వివరించారు. సాగునీటి వనరుల అభివృద్ధి, రైతులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నీటి నిర్వహణలో పారదర్శకత ఉండాలని, ఇందులో రైతులు, ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ఎమ్మెల్యే రవికుమార్ అభిప్రాయపడ్డారు. ఈ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా కాలువల పూడికతీత, శుభ్రపరిచే పనులు, చెరువుల పునరుద్ధరణ వంటి పనులను ప్రాధాన్యత క్రమంలో చేపడతామని వెల్లడించారు. నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా భవిష్యత్తులో నీటి కొరత అనే మాటే వినిపించకుండా చర్యలు తీసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ప్రభుత్వ లక్ష్యం నెరవేరాలంటే సాగునీటి సంఘాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కూటమి ముఖ్య నాయకులు, నియోజకవర్గ పరిధిలోని వివిధ సాగునీటి సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు, ఇరిగేషన్ శాఖ అధికారులు, పెద్ద సంఖ్యలో రైతులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.



## నీటి భద్రతపై.. జలయజ్ఞం


* ఎమ్మెల్యే గొండు శంకర్ పిలుపు



**శ్రీకాకుళం, ఏప్రిల్ 6 (వార్త):** సానివాడ గ్రామంలో 'నీటి భద్రత - సాగునీటి సంఘాల బాధ్యత' అనే కార్యక్రమాన్ని శ్రీకాకుళం నియోజకవర్గ ఎమ్మెల్యే గొండు శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి కోసం చెరువులను పునరుద్ధరించడం, ప్రతి బొట్టు నీటిని సంరక్షించడం, భూగర్భ జలాలను పెంచుకోవడం అత్యంత అవసరమని పేర్కొన్నారు. నీరు మన జీవనాధారమన్నారు. రైతులు బలంగా ఉంటేనే గ్రామాలు, రాష్ట్రం అభివృద్ధి చెందుతాయని స్పష్టం చేశారు. ఈ లక్ష్యాలతో రాబోయే 90 రోజుల పాటు ఈ కార్యక్రమాన్ని ఒక జలయజ్ఞంలా కొనసాగించనున్నట్లు తెలిపారు. చెరువుల్లో పూడికతీత పనులు, కాల్వల అనుసంధానం వంటి అంశాలపై అధికారులతో కలిసి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని సూచించారు.ఇది కేవలం ప్రభుత్వ కార్యక్రమం మాత్రమే కాదని, మన భవిష్యత్తు కోసం చేస్తున్న బాధ్యతాయుతమైన పనిగా భావించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రైతులతో, ముఖ్యంగా మహిళా మరియు పురుష రైతులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకోవడమే తన ఉద్దేశమని తెలిపారు. ప్రజలు చెప్పే ప్రతి సమస్యను అధికారులు వెంటనే నమోదు చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. ఈ జలయజ్ఞంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నీటి సంఘాల నాయకులు, అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## పార్టీ నేతలకు పరామర్శ

**సోంపేట, ఏప్రిల్6 (వార్త):** బేసి రామచంద్రాపురం, బాతుపురం గ్రామాలలో వైసిపి నేతలను జిల్లా పరిషత్ చైర్పర్సన్ పిరియా విజయ, ఎంపీపీ డాక్టర్ నిమ్మన దాసు సోమవారం కలిసి పరామర్శించారు. బేసి రామచంద్రాపురంలో పార్టీ సీనియర్ నేత బుద్దాన లోకనాథం అనారోగ్యంతో బాధపడుతున్న పరిస్థితుల్లో ఆయనను కలిశారు. యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఎంజీపురం సర్పంచ్ సకల బత్తుల హరీష్ కుమార్ తల్లి రూపవతి అనారోగ్యంతో బాధపడుతున్న పరిస్థితుల్లో వారిని కలిసి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వీరితోపాటు పార్టీ నేతలు బుద్దాన శ్రీకృష్ణ శిలగాన భాస్కరరావు బతకల మోహన్రావు రౌతు విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.



## మెనూ సక్రమంగా అందజేయాలి

* మౌలిక వసతులు కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలి
* డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్ సంద్ర

**ఎచ్చెర్ల, ఏప్రిల్ 6 (వార్త):** విద్యార్థులకు నిర్దేశిత మెనూను అందజేయాలని డైరెక్టర్ ఆచార్య అమరేంద్ర కుమార్ సంద్ర అన్నారు. రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం రాజీవ్ గాంధీ యూనివర్సిటీ ఐఐఐ లో డైరెక్టర్ సంద్ర అమరేంద్ర కుమార్ శుక్రవారం ఉదయం ఆకస్మికంగా మెస్ సందర్శించారు. ఉదయం తయారుచేసిన అల్పాహారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం విద్యార్థులతో కలిసి సహపంక్తి అల్పాహారం చేశారు. విద్యార్థినీ విద్యార్థులకు అందజేసిన ఆహారం క్వాలిటీ విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని ఐఐఐటి అధికారులను ఆదేశించారు. శ్రీకాకుళం అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రామకృష్ణ ముని, డీన్ డాక్టర్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ డాక్టర్ వాసు, వెల్ఫేర్ డీన్లు సింహాచలం యోగేశ్వరి మరియు క్యాంపస్ 2 ఇంచార్జి సాగర్ మెస్ కోఆర్డినేటర్లు, మెస్ కమిటీ సభ్యులు మెస్‌లను సందర్శించారు. ఆహారం తయారీకి వాడే అన్ని పదార్థాల నాణ్యత ను పరిశీలించారు. డైరెక్టర్ సంద్ర అమరేంద్ర కుమార్ విద్యార్థులతో మాట్లాడుతూ మెరుగైన ఆహారం అందించడం ద్వారా విద్యార్థినీ విద్యార్థులు విద్యపై దృష్టి సారించే అవకాశం ఉందన్నారు. నాణ్యమైన ఆహారం అందించడం లో ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశంపై పలు సూచనలు, సలహాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పరిపాలనఅధికారి ముని రామకృష్ణ ,డీన్ అకడమిక్స్ శివ రామకృష్ణ, ఫైనాన్స్ ఆఫీసర్ వాసు, ఫిజిక్స్ డిపార్ట్మెంట్ విభాగపతి శ్రీధర్ ఉద్యోగులు, సహచర ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.



# హోంగార్డు సంజీవ్‌రావుకు ఎస్పీ అభినందన

**శ్రీకాకుళం, ఏప్రిల్ 6 (వార్త):** రాష్ట్ర స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలలో సిల్వర్ మెడల్ సాధించిన హోంగార్డు ఎం. మహదేవ్ సంజీవ్ రావును జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి అభినందించారు. రాజాంలోని జిఎంఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో, ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4,5 తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించిన 13వ ఏపీ స్టేట్ సబ్ జూనియర్, జూనియర్ మాస్టర్స్ (మెన్ అండ్ ఉమెన్) క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ - 2026 పోటీలు నిర్వహించారు. శ్రీకాకుళం జిల్లా పోలీసు శాఖకు చెందిన హోంగార్డు ఎం. మహదేవ్ సంజీవ్ రావు ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించారు. మాస్టర్స్ విభాగంలో 83 కిలోల బాడీ వెయిట్ కేటగిరీలో స్క్వాట్, డెడ్ లిఫ్ట్, బెంచ్ ప్రెస్ విభాగాల్లో అద్భుత ప్రదర్శన కనబరిచి ద్వితీయ స్థానం సాధించారు.



Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546